క్లుప్తంగా

7న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక: టి.సిరసపల్లిలో **కాశీ విశ్వేశ్వర** స్వామి ఆలయ 5వ వార్షికోత్స**వం ఈ నెల 7న** ఘనంగా నిర్వహించనున్నట్టు **ఉత్సవ కమిటీ** సభ్యులు తెలిపారు. ఉదయం **నుంచి ఆలయ** ప్రాంగణంలో ప్రత్యేక పూజా **కార్యక్రమాలు** జరుగుతాయన్నారు. అదే రోజు **ఆలయ ప్రాం**గణంలో కాశీ విశ్వేశ్వరస్వామి–అన్నపూర్ణమ్మల కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కాశీ విశ్వేశ్వరున్ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మురళీధర్

మునగపాక: మునగపాక మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మురళీధర్‌ను నియమించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి నియామకపు ఉత్తర్వులు అందాయి. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్‌.ఆదిమహేశ్వరరావును పాయకరావుపేటకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌ను నియమించారు. అయితే ఆయన ఇప్పటికీ బాధ్యతలు చేపట్టకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ డీటీగా సేవలందిస్తున్న మురళీధర్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం ప్రశాంతి

ఎస్‌.రాయవరం: ఉపాధ్యాయ వృత్తిని చిత్తశుద్ధితో నిర్వహిస్తే ఎక్కడికి వెళ్లినా గుర్తుంటారని ధర్మవరం అగ్రహారం ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి అన్నారు. పాఠశాలలో సుదీర్ఘ కాలం పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను బుధవారం సహచరులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో ఇప్పటి వరకు వారు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, కుసుమకుమారి, విమలాదేవి, దీపిక, శోభారాణిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లలితాంబ, ఆర్‌.అప్పలనాయుడు, గారా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎస్‌.రాయవరం: పెదగుమ్ములూరు విద్యుత్ సబ్ స్టేషన్ చినగుమ్ములూరు ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్లలో చెట్టుకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, సీతారాంపురం, నీలాద్రిపురం, నక్కపల్లి మండలం పెదబోదిగలం, పెదదొడ్డిగల్లు, రామకృష్ణాపురం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాయకరావుపేట: మండలంలోని ఈదటం, కందిపూడి, పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, రాజయ్యపేట గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని 14 గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మట్ట ధర్మవరం, మార్టూరు రోడ్ దిబ్బపాలెం, భోగాపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, మార్టూరు, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్ గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వర్షం పడితే చెరువే.!



పెదఉప్పలం పాఠశాలకు సమీపంలో చెరువును తలపిస్తున్న వీధి రోడ్డు

ఎస్‌.రాయవరం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వీధి రోడ్లు చెరువును తలపిస్తున్నాయి. పెదఉప్పలం పాఠశాలకు సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటితో స్థానికులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. బంగారమ్మపాలెంలోని వీధుల్లో వర్షపు నిలిచిపోవడంతో చిత్తడిగా మారాయి.

యలమంచిలి స్టేషన్‌లో సమస్యల కూత.!

- స్టేషన్ అంతటికీ ఒక్కటే మరుగుదొడ్డి
- రైలెక్కే వరకు ఓపిక పట్టాల్సిందే.!
- అరకొరగా కూర్చొనేందుకు బెంచీలు
- రెండేళ్లుగా సాగుతున్న అమృత్ భారత్ పనులు



యలమంచిలి రైల్వేస్టేషన్

యలమంచిలి రూరల్: జిల్లాలో అనకాపల్లి తర్వాత యలమంచిలి రైల్వేస్టేషన్ ప్రధానమైనది. నియోజకవర్గ కేంద్రమైన ఈ రైల్వేస్టేషన్‌లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.13.13 కోట్లతో రెండేళ్ల క్రితం ఇక్కడ ప్రారంభించిన అభివృద్ధి పనులు సా..గుతున్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో రైల్వే అధికారులు కూడా స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. దీంతో ఈ రైల్వేస్టేషన్‌లో సరైన సౌకర్యాలు లేక రాకపోకలు సాగించే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ మరుగుదొడ్లు, తాగునీటి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు వస్తుంటారు. ఈ రైల్వేస్టేషన్ అంతటికి ఒకటో నంబరు ప్లాట్ ఫాంపై తాత్కాలికంగా ఒకే ఒక్క మరుగుదొడ్డి ఏర్పాటు చేశారు. ఈ కారణంగా రైల్వేస్టేషన్‌కు వచ్చే మహిళలు, బాలికలు, యువతులు, వృద్ధులు, పిల్లలు అత్యవసర సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. రైల్వేస్టేషన్‌లో మిగిలిన ప్లాట్‌ఫాంల నుంచి ప్రయాణికులు కూడా ఒకటో నంబరు ప్లాట్‌ఫాంకు రావాల్సిందే. ఈ తాత్కాలిక మరుగుదొడ్డి నిర్వహణ కూడా అత్యంత అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తమ ఆత్మగౌరవాన్ని మరిచిపోయి బహిరంగ ప్రదేశాల్లోనే కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా సరిపడా తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు తాము ఎక్కాల్సిన రైలు వచ్చే వరకు ఓపిక పట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

తాగునీటికీ తిప్పలు

యలమంచిలి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు తాగునీటి సౌకర్యం కూడా సక్రమంగా లేదు. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై మాత్రమే ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి ఉంది. దీని పరిసరాలు కూడా చాలా అపరిశుభ్రంగా ఉన్నాయి. దీనికి సరఫరా అయ్యేది కూడా బోరు నీరే కావడంతో ప్రయాణికులు డబ్బు పెట్టి మినరల్ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇక రెండో నెంబరు ప్లాట్‌ఫాంపై తాగునీటి సౌకర్యం పూర్తిగా లేదు. బ్రిటిష్ పాలకుల కాలం నుంచి యలమంచిలి రైల్వేస్టేషన్ కొనసాగుతున్నా, నియోజకవర్గంలో ప్రత్యేక ఆర్థిక మండలి, నేవీ స్థావరాలు, పలు పరిశ్రమలు ఉన్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. కనీస అవసరాలైన టాయిలెట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు లేకపోవడంపై సర్వత్రా తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.



బెంచీలు లేని యలమంచిలి రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం



యలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై తాత్కాలిక మరుగుదొడ్డి

ఒక్కటే మరుగుదొడ్డి



యలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి ఒక్కటే ఉంది. అది కూడా నిర్వహణ లోపంతో కంపు కొడుతోంది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి మహిళలు, యువతులు, బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే బహిరంగ మల, మూత్ర విసర్జన తప్పడంలేదు. నిబంధనల ప్రకారం అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టరుపై ఉంది. రైల్వే అధికారులకు ఇదంతా తెలిసినా ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోవడంలేదు.

– కొటారు దుర్గారావు, యలమంచిలి

పరశురామావతారంలో జగన్నాథుడు



పరశురాముడిగా దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక: నాగులాపల్లి, మునగపాక గ్రామాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు బుధవారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని జగన్నాథుని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. నాగులాపల్లిలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ నెల 6న జగన్నాథుని పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు రెయిన్ కోట్లు పంపిణీ



కూలీలకు రెయిన్ కోట్లు అందిస్తున్న రామరాజు

ఎస్‌.రాయవరం: గుర్రాజుపేట గ్రామంలో ఉపాధి కూలీలకు గ్రామానికి చెందిన స్థానిక నాయకుడు రామరాజు రైయిన్ కోట్లు బుధవారం పంపిణీ చేశారు. ఉపాధి కూలీలు ఎండా, వానా లెక్క చేయకుండా పనులు చేస్తుంటారని, వారికి రెయిన్ కోట్లు ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గ్రామంలో ఉన్న 300 మంది ఉపాధి కూలీలకు వీటిని అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కురందాసు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

యలమంచిలి రూరల్: విద్యార్థి దశ నుంచే అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని యలమంచిలి అగ్నిమాపక కేంద్రం అధికారి డి.రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని అలివేలు మంగ స్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై ఆయన అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని నిరోధక పరికరాలను ఎలా వినియోగించాలో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చూపించారు. కొందరు విద్యార్థులతో సిలిండర్‌లో ఉన్న కార్బన్ డయాక్సైడ్‌ను ఉపయోగించి మంటలను ఆర్పే విధానాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం జె.కామేశ్వరి, ధీరజ్ నాగ్, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఎల్‌హెచ్‌ఏ చిరంజీవి, కోటేశ్వర్రావు, జి.రవికుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

'పారదర్శకంగా సామాజిక తనిఖీ'

మునగపాక: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. అయితే సామాజిక తనిఖీ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పథకం నిర్వహణలో అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. సామాజిక తనిఖీ సమన్వయ కమిటీ సభ్యులు బాధ్యతగా సేవలందించాలన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో శివ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు అన్నారు.

మండలంలోని నాగవరం ఎంపీయూపీ స్కూల్‌లో పని చేసి బదిలీపై వెళ్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పొలిపిని శ్రీనివాసరావు, వెంకట్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నాయకులు

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వాడ్రాపల్లిలో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన 104 వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత మాట్లాడుతూ ఎటువంటి అనారోగ్యంగా ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. బీపీ, మధుమేహం బాధితులు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. ఆరోగ్య సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్వరలో శిథిల భవనాల తొలగింపు

- నూతన భవనాలకు ప్రతిపాదనలు
- బోదిగల్లం పాఠశాలను పరిశీలించిన డీఈవో

సాక్షి ఎఫెక్ట్..

నక్కపల్లి: మండలంలో పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిథిల భవనాలను త్వరలోనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు తెలిపారు. పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల దుస్థితిపై 'క్షణ క్షణం.. భయం భయం' శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. బుధవారం పాఠశాలకు వచ్చి శిథిల భవనాలను పరిశీలించారు. పెచ్చులు రాలిపడుతున్న శ్లాబ్‌లను చూశారు. కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహించవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. శిథిల భవనాల చుట్టూ విద్యార్థులు వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి శిథిల భవనాలను త్వరలోనే కూల్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. డీఈవో వెంట జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు, ఎంఈవో కుంచం నరేష్, ఉన్నారు.



శ్లాబ్ పెచ్చులు రాలుతున్న తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పాయకరావుపేట: మండలంలోని ఎస్‌.నర్సాపురం, కుమారపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన అనంతరం రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ ఖరీఫ్ వరి నారుమడి యాజమాన్యం, పంటల బీమా నమోదుపై అవగాహన కల్పించారు. పీఎండీఎస్ కిట్లు, పచ్చిరొట్ట విత్తనాలు గురించి వివరించారు. విత్తనశుద్ధి వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ నేలలు స్వభావం, మట్టి నమూనాల ప్రాముఖ్యత, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగమణి, వీఏఏ కల్పన, వీహెచ్‌ఏ రూప, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న పాయకరావుపేట వ్యవసాయ శాఖ అధికారులు

అధ్వాన రహదారులతో ఇక్కట్లు



ఎంపీడీవో కార్యాలయం వద్ద నిలిచిపోయిన వర్షం నీరు



ఇందేశమ్మవాక వద్ద రహదారి పరిస్థితి

కోటవురట్ల: అధ్వాన రహదారులు విశ్వరూపం చూపిస్తున్నాయి. ప్రస్తుత వర్షాలతో రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. ప్రధాన రహదారులే దారుణంగా ఉండడంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలతో ఊదరగొట్టింది. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రహదారులను అద్దంలా మార్చేస్తామని సెల్ఫీలతో హడావుడి చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక రహదారుల అభివృద్ధి మాటే మరిచారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన రహదారులే ఇప్పటికీ దిక్కయ్యాయి. మండలంలో గత ప్రభుత్వంలో సుమారు రూ.12 కోట్లతో వివిధ రహదారులను అభివృద్ధి చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పలు రోడ్ల పనులు నిలిచిపోయాయి. కనీసం ఆ రహదారులను కూడా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు.

రామచంద్రపురం జంక్షన్ నుంచి ఎస్‌.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు రహదారి దారుణంగా తయారైంది. ఇందేశమ్మవాక ఘాట్ వద్ద రోడ్డు పెద్ద గోతులు పడడంతో ప్రస్తుత వర్షాలకు నిండిపోయి చెరువును తలపిస్తోంది. కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద రోడ్డు చిన్నపాటి వర్షానికి చెరువులా మారిపోయింది. దగ్గరలోనే తుపాకుల గెడ్డ ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. వంద మీటర్ల మేర డ్రైనేజీ నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారానికి నోచుకుంటుంది. జల్లూరు వంతెన వద్ద అప్రోచ్‌రోడ్డు నిర్మాణంలో మట్టితో నింపి వదిలేశారు. ప్రస్తుత వర్షాలకు అప్రోచ్ రోడ్డు రెండు వైపులా చిత్తడిగా మారడంతో వాహనచోదకులు జారిపడుతున్నారు. అధికారులు స్పందించి కనీస మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.



జల్లూరు వంతెన వద్ద రోడ్డు పరిస్థితి



మునగపాక బీసీ కాలనీ రోడ్డులో వర్షపు నీరు

ముసురుతో పాట్లు

మునగపాక: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించిపోయింది. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.